నైజరుతేనె

ఇంచుమించు పదేళ్ళ తరవాత ఈ రాస్తా మీద ప్రయాణం చేస్తున్నాను. ఈ ఘాటీ రోడ్డుకు ఒక ప్రక్కను కొండపైన చెట్లపచ్చదనం, రెండో ప్రక్కనున్న లోయల్లోని సోయగం, ఈ ప్రకృతిలోని భాగంగా నన్ను యిముడ్చుకుని నా వయసును పదేళ్ళు తగ్గించి వేస్తున్నట్లు ఫీలవుతున్నాను.

ఆ రోజూ, ఈ రోజులానే నవంబరు అఖరు వారంలోనిదని గుర్తు. అనాడు ఒంటరిగా కొత్త ఫియట్ కారులో పోతున్నప్పుడు నా గర్వానికి కారణం ఆ కొత్త కారెంత మాత్రం కాదు. గుర్రపు బగ్గీని వదలి కారును మా పట్నంలో తొలిసారి ప్రవేశపెట్టిన ఘనత మా తాతయ్యకు దక్కింది. పచ్చరంగు పెద్ద చెవర్లెట్ కారు రోడ్డంట పోతుంటే ప్రజ యేనుగు పోతుంటే వెంటపడే పిల్లల్లా చూసేవారట. ఆ సంతతి వాడిననే గర్వం!

మా తాతయ్యకు పాలూబాదం, పట్టుతేనె, జీడిపప్పు, పొటేలు గుండె కాయలు యిచ్చిన బలంతో తన్నుతాను లొంగదీసుకోకుండా యెదుటివాళ్ళ నెందరినో లొంగదీసుకున్నాడు. డబ్బు సంచులను యింటి చుట్టూ ఆడించి "ఇవే నా అల్సేసియన్లని" గెంతేవాడట. అతని కండల పొందిక, పొంగు, రంగు, పొంకం నేనూ పంచుకున్నానన్న గర్వం నాది!

తాతయ్యది పందెం గుర్రం పరుగు. శరీర సుఖమేగాని ఆత్మశక్తి యెరగని పరుగది. అతనికి లేని గుండెచూపు నేను పొంది, లోకంలో బ్రతికి, ప్రేమించి, తెలుసుకుని, ఆలోచించి, యిచ్చిపుచ్చుకుని, నవ్వుతూ బ్రతకాలనే తాపత్రయపడుతున్న వయసు నాది.

ప్రేమకు నాలుగు స్వరూపాలిచ్చినా నెగ్గలేక భ్రాతృభావంలేని నా సంఘానికి దూరంగా యెటో పోదామన్న తహతహతో ఆ రోజుల్లో చేసిన ఒంటరి ప్రయాణాల్లో అదొకటి.

కొండల్లో నున్న "సుంకి" దాటి "పొట్టంగి" వేపు వెళ్తుంటే ఇటూ, అటూ ఇక్కడా, అక్కడా, కొండలమీదా, చెరియల్లోనూ పువ్వుల పసుపురంగు చీరలు యెగురుతున్నట్లు నైజరు పంట.

పొట్టంగిలో ఆగి రహదారి బంగళా వరండా మీదనించి చూస్తే ఈ కొండల మధ్య వెలుగుతున్న విశ్వం నానా రూపాలతో కనిపించి, అందులో ఆతృతతో లీనమైపోవాలని దిగిపోయాను. ప్రకృతి ప్రతిరూపంగా కదిలే అపురూపమైన ఆకారం కోసం నా దృష్టి లగ్నమైపోయింది. అలా వెతుక్కుంటూ వెళ్తూ "సునాబెడా" దాటాను. అప్పుడే సాయంత్రమౌతోంది. చిన్న చలి వేస్తోంది. అక్కడకు కోరాపుట్ తొమ్మిది మైళ్ళు. ఆ రాత్రి అక్కడ సర్క్యూట్ హౌస్‌లో వుంటానని అనుకున్నాను.

అంతలో చప్పున నా దృష్టి నా కుడివేపు మళ్ళింది. నాలుగు గజాలు కారు పోనిచ్చి రోడ్డువార కారు ఆపాను. ఏదో రిపేరు వచ్చినట్లు ఒకసారి చూశానేగాని నా చూపు ఆ కొండల మధ్యలో నున్న చిన్న కాలిబాట మీద ఒంటరిగా రివ్వున వస్తున్న యువతి వేపే వుంది.

పచ్చని ప్రకృతి పదిలంగా ప్రపంచానికి అందిచ్చిన కానుక యిది. భూమాత అడవి మధ్యలో కని ఈ కొండల్లో విడిచిపెట్టిపోయి వుంటుంది. ఇక్కడి రాళ్ళ రంగును పులుముకొని ఈ చెట్ల పచ్చదనం కప్పుకుని నా దగ్గరకు వస్తూ ఒక్కసారి చిరుతపులిలా గెంతి రోడ్డు రెండోవేపు వున్న కాలిబాట మీద పరుగు నడకలతో పోతోంది. వెళిపోతూ ఒకసారి తిరిగి చూసింది. ఆ నల్లని మెట్టపై ఒకే ఒక బంతిపువ్వు. ఆ దగ్గరలో నున్న కోయ గ్రామం ఆమె చేరుకునేవరకు చూస్తున్నాను. కొంతసేపట్లో ఆ ఊరునించే పదిమంది నావేపు రావటం చూశాను. అక్కడినించి పారిపోవడం యిష్టంలేక కారుకు ఏదో రిపేరు చేస్తున్నట్లు నటించాను.

వచ్చినవాళ్ళకు నా భాష రాదు. వాళ్ళ భాష నాకు అర్థం కాదు. సైగలతో వాళ్ళు చెప్పినదాన్నిబట్టి చీకటిపడ్తోంది వాళ్ళ ఊరు రమ్మనమని ఆహ్వానిస్తున్నారు. ఆ పిలుపు కోసమే ఆగిన నేను కారువేపు చూస్తుంటే దాని నెవరూ

ముట్టుకోరని హామీ యిచ్చి నన్ను వెంటతీసుకపోయారు. నాలుగు అడుగులు వేశాక వాళ్ళలో నలుగురు ముందు పరుగెత్తారు. ఏం చేస్తారో ఏమోనని అనుమానంతోనే నడుస్తున్నాను. గ్రామ శివార్లకు వెళ్ళేసరికి గ్రామమంతా డోలూ, సన్నాయి నాగస్వరంతో నాకు స్వాగతం యిచ్చారు. ఆ రాత్రి కూడా ఆ స్వరమే వినిపించింది. నన్ను గ్రామం మధ్యలో నున్న మర్రిచెట్టు క్రింద దిమ్మమీద కూర్చోబెట్టారు. నా మెడలో ఒక బంతిపూలదండ వేశారు. ఒక పెద్ద నాగులా ఆడా మగా నిల్చొని నాగస్వరం ఊదుతుంటే చాలా ఉధృతంగా కదలుతూ గదబ నృత్యం చేశారు. పడగలా ముందు చిన్నగుడ్డను పట్టుకుని భంగిమలు మార్చుతూ ఈ నాట్యం చేసే తోరణాన్ని నడుపుతోంది పచ్చని చీరని కట్టుకున్న పర్బతీ. ఎటువంటి అరమరికలు లేవు. ఆ ఆడామగా అంతా నడుమూ చేయీ కలుపుతూ చేస్తున్న నృత్యం అది. నేనూ చివర్లో వాళ్లతో చేతులు కలిపాను. ఒకే బిగిలో వాళ్ళు రెండుగంటలు నాట్యం చేసినా అలసిపోలేదు. వాళ్ళతోపాటు నేనూ ఆ తియ్యని "సాలాబ్" కల్లు తాగాను,

ఆ ఊరు చిక్కారపార. గ్రామపెద్ద ఇంటిబయట ఆ రాత్రి వెన్నెల్లో కొంతసేపు నిల్చున్నాను. ఎన్నిచోట్లో యెన్ని విధాలుగా వెతికినా దొరకని తృప్తి నాలో కలిగింది. ఉదయమే లేచి ఊరి బయట కొండవార నీటివాగు వేపు వెళ్ళాను. ఎర్రని బింబం, వెలుగు బాణాలతో పొగమంచును చీల్చుతూ ప్రకాశిస్తోంది. నీటివాగు దగ్గర పళ్ళు తోముకుని తల యెత్తాను. మట్టి కుండలో నీరు నింపుతున్న పర్బతీ కనిపించింది. ఊరికి ఒక మూలనున్న ఆమె ఇంటివేపు చేయి చూపించింది. నిండుకుండను నెత్తిన పెట్టుకుని 'నాతో రా' అన్నట్లు సైగ చేసింది. నిన్న సాయంత్రం కారు దగ్గర, ఈవేళ ఉదయం నీటివాగు దగ్గర ఈమె ఒక్కలానే వుంది. నడక అదే–చూపు అదే. వెంటపోతూ కాలికేదో తగిలినట్లు నే నాగితే ఆమె తిరిగినప్పుడు ఆ ముఖంలో విచిత్రమైన వెలుగుకోసం తలెత్తాను. ఆ నునుపైన శరీరం మెలికలు తిరగ్గానే నా కాళ్ళు భూమ్మీద లేవు. కొంతదూరం నడిచాక లేని దాహం నటిస్తే నెత్తిమీద కడవ దింపి ప్రక్కకు వంగి నీరు పోస్తే నా దృష్టి వేరోవంకకు తిరిగింది. నీరు దిగువ నేలను తడిపింది.

చిన్నపాక, చక్కని పాక. చుట్టూ పేడతో అలికిన గోడలపై తెల్లని ముగ్గులు ఉన్న ఒకే గుమ్మానికి తడక తలుపు, ఆ తలుపుపై విల్లమ్ములు పట్టుకుని పరుగెత్తే వేటగాని బొమ్మ, ఆ యింటి నానుకుని పడమరవేపు నూనెగింజలిచ్చే నైజరు పంటతో నిండిన పొలాలు, ఆ పసుపురంగు పువ్వుల తివాసీతో కప్పుకున్న భూమి మధ్యలో ఒకే ఒకచెట్టు. ఆ ముదర మామిడి చెట్టుకున్న పెద్ద తొర్ర కనిపిస్తోంది.

ఆమె గొంతుక వినిపించింది. ఇంట్లోకి రమ్మని సైగచేసింది. వరండా మీద నిల్చోనే లోనికి చూశాను. తుంగచాప మీద ఒక నల్లని మనిషి నిద్దరపోతు న్నాడు. గోచీ తప్పించి ఒంటిమీద ఇంకో గుడ్డలేదు. వెనుతిరిగి పడుకున్న సింహంలా వున్నాడు. వాడిని తట్టి లేపింది. విసుక్కుంటూ లేచి నన్ను చూడ గానే గాభరాగా లేచిపోయాడు. పర్బతీ యేం చెప్పిందో యేమో సోముగాడి ముఖం చేటంతయి అంత పెద్ద నవ్వు నవ్వాడు. వెంటనే చేతిలో చిన్న మట్టి చెంబును పట్టుకుని మామిడిచెట్టువేపు పరిగెత్తాడు.

ఇంట్లో పర్బతి—వరండాలో నేను. ఇద్దరం చూసుకున్నాం. నా దిష్టితో పర్బతీ అందం పెరిగిందిగానీ, తరిగిపోలేదు. నేను సివంగిని, నువ్వు నక్క వన్నట్లు నా చూపులు ఆమెలో ఎటువంటి సంచలనం కలిగించలేదు. మనసులో కోరిక ఒక నవ్వు రూపంలోనైనా రాలలేదు. నా దగ్గరగా వచ్చి నన్ను పాక బయటకు తీసుకవస్తుంటే యింతకన్నా ప్రీతినిచ్చే వస్తువు ఇక నాకు దొరకదని తస్కరించాలనుకున్నాను. కానీ, భయం!

సోముగాడు నేను చూస్తుండగానే మామిడిచెట్టు యెగబ్రాకాడు. ఆ తొర్రలో చేయిపెట్టి ఏదో తీస్తున్నాడు. కొంతసేపయ్యాక దిగి మా వేపే పరుగెత్తుకొని వచ్చాడు. అప్పటికే నేను దూదిలా అయిపోయాను. నన్ను లోనికి తీసుకవెళ్ళారు. పర్బతి నన్ను చాపమీద కూర్చోబెట్టింది. ఆ మట్టి చెంబు మొగుడి చేతినించి తీసుకొని నాచేత పెట్టి, తాగు అన్నట్లు సైగజేసింది. పసుపు పచ్చగా పాము విషంలా కనిపిస్తోంది. నేను సంశయిస్తుంటే చప్పున పర్బతీ మూడు వేళ్ళు ముంచి ఒక వేలు సోము నోటిలో పెట్టింది. వాడు చప్పరించాక రెండో వేలిని ఆమె నోట్లో పెట్టుకొని చప్పరించి మూడో వేలును నా నోట్లో పెట్టడానికి వచ్చింది. సిగ్గుపడ్డాను.

తరవాత తెలిసింది- ఇది నైజరు తేనె అని. ఈ కాలంలో తేనెటీగలు ఈ పసుపు పచ్చని నైజరు పూలనించి సృష్టించిన తేనె ఈ రంగులోనే వుంటుం దని. ఈ తేనెను పట్టునించి పిండి సోమూ తెచ్చాడు. తాగాను. అంత తీపి తేనెను నేనెప్పుడూ ఇదివరకు తాగలేదు. అక్కడక్కడా తేనెటీగల కాట్లతో బొబ్బలు దేరినా పట్టింపు చేసుకోకుండా తృప్తితో పెళ్ళాన్ని వెంట వేసుకుని నన్ను సాగ నంపాడు.

అందరి దగ్గరా సెలవు తీసుకుని కారు దగ్గరకు వచ్చాను. నా చుట్టూ అంతా గుమిగూడారు. నాకేం చెయ్యడమో తోచలేదు. నా కారుపై ఎవరూ చేయి వేయని న్యాయం ఇక్కడ వుంది. నా సంఘం సృష్టించిన విలువలను ఇక్కడ విడిచి పెట్టాలని తట్టలేదు. నేనిచ్చిన పదిరూపాయిల నోట్లను ఆ గ్రామపెద్ద

పట్టుకుని పక పక నవ్వాడు. ఆ నోటు చింపడానికిపోయి కోపంతో తన గోచీ చివర చింపుకున్నాడు. ఆ పది కాగితాలు నా జేబులో పెట్టి ఏమన్నాడో యేమిటో-నేనొక భూతాన్నో,పిశాచాన్నో అన్నట్టు అంతా నన్ను వదిలి వెనుకకు చూడకుండా వాళ్ళ ఊరివేపు పరుగెత్తారు. అలా కారు స్టీరింగు పట్టుకుని చాలా సేపు కూలబడి విధిలేక మళ్ళీ వెనుకకు తిరిగాను.

మళ్ళీ పదేళ్ళకు ఈనాడు ఆ త్రోవలో పడ్డాను. నా సంఘం. మీ సంఘమే కాబట్టి మీ అందరూ పడుతున్న బాధలులాంటివే నావీను. పోతే, నేను బాధలు, భీతి, అసూయా, అసహనం, పోటీ గీటీ అంతా బతకడానికి అవసరం అన్నట్లు కావు కావుమని కాకిలా అరచిన జీవితంనుంచి బయటపడాలనే కాంక్షను కాల్చుకో లేకపోయాను. అరమరికలు లేని అనాటి వాళ్ళతో కొన్నాళ్ళు గడిపితే మనశ్శాంతి వస్తుందని కోరాపుట్‌లో అర్జంటు పని వుందని, భార్యా బిడ్డల్ని వెంటరానివ్వక ఒంటరిగానే కారులో వస్తున్నాను.

సుంకు దాటాను. పొట్టంగి నేను క్రితం సంవత్సరం చూసిన ఇంగ్లాండులో గ్రామసీమలా వుంది. అనాటి వాతావరణం మారలేదు. అనాటి పసుపు పచ్చని పూల వనాలు ఈనాడూ ఉన్నాయ్. అనాడు గ్రోలిన తియ్యని నైజరు తేనెను ఈనాడూ గ్రోలాలని యెక్కడా ఆగకుండా ఆతృతతో అదే మైలురాయి దగ్గర కారును ఆపాను.

చిక్కరపార! రోడ్డుమీద నిల్చొని అటుచూస్తే పెంకుటిల్లు కనిపించింది. నమ్మలేక నాలుగడుగులు ముందుకు వేశాను ఊరి మధ్యలోనున్న మర్రిచెట్టు కన్నా యెత్తుగా ఎలక్ట్రిక్ స్థంభం. చెప్పితేగానీ మనుషులు కారు దగ్గర కావలాకు దొరకలేదు. అడిగితేగానీ ఇక్కడ ఇప్పుడు యేమీ దొరకటంలేదు. సాలాప్ కల్లు అడిగితే వంట సారా దొరుకుతోంది. బేరాలాడాకే గదబ నృత్యం! గుడ్డి దీపం లేదు. ట్యూబ్‌లైటుక్రింద లయలేని నృత్యం అంతా కృత్రిమంగా కని పించింది. విధిలేక గెంతుతున్నారు. డబ్బు పంచుకుందామని గెంతుతున్నారు. ఆ లయవిన్యాసం లేదు. దెబ్బతిన్న పాములా గుంపు కదలుతోంది.

గదిలో మంచం. నన్ను వాళ్ళు నమ్మనట్లు- నేను వాళ్ళను నమ్మనట్లు గడియలు వేసుకున్నారు. ఉదయమే లేచాను. కొండచరియలోని నీటివాగు వేపు వెళ్ళాను. ఆడవాళ్ళు నీళ్ళు మోస్తున్నారు మట్టికుండలే కావు. యిత్తడి బిందెలు, స్టెయిన్‌లెస్ స్టీలు చెంబులు కనిపించాయి. నేను ముఖం కడుక్కుటుంటే అంతా నావేపే అనుమానంగా చూస్తున్నారు. అక్కడనించి చూస్తే మామిడిచెట్టు కనబడ లేదు. ఇక్కడకు కొత్తగా వచ్చిన విమానాలు తయారుచేసే ఫ్యాక్టరీ సిబ్బంది వంట చేసుకోడానికి బొగ్గుల రూపంలో రవాణా అయిపోయిందని తరవాత

తెలుసుకున్నాను. నాకు తియ్యని తేనె ఇచ్చిన చెట్టు- పచ్చని మామిడిచెట్టు వ్యాపారదృష్టితో ఒక్క-వేటుతో ఎండిపోయి బొగ్గయిపోయింది. ఐనా, ఆ ఊరి చివర నైజరు పండే పొలాల గట్టున వున్న ఆ పాకవేపు నా కాళ్ళు అనుకోకుండా కదిలాయి.

అక్కడ వున్న పర్బతీ మాత్రం మారదు. మారలేదు. ఆ బింకం పొంకం కాలం కన్నీటితో కరిగిపోదు. ఆమె నిత్యం నూతనంగా వుండే దేవకాంత నా దృష్టిలో.

పర్బతీ వాకిట్లో చేతిలో పిల్లకు పాలు పట్తోంది. నన్ను చూడగానే సిగ్గుపడుతూ లేచి నిల్చుంది. నన్ను పోల్చుకుంది. మిగతా ముగ్గురు పిల్లలూ నావేపు కొర కొరా చూస్తున్నారు. ఇదివరకులేని జాకెట్ ఇప్పుడు! పిల్లల తల్లయినా శరీరమంతా చప్పున య్యెర్రని చీరతో కప్పుకుంది. సోము విమానం కంపెనీలో తోటమాలిగా వున్నాడట

"నైజరుతేనె" అన్నాను. ఒకసారి లోనికి వెళ్ళి ఒక గాజుసీసా తెచ్చింది. నా చేత పెట్టి, దాని విలువతే అన్నట్లు చెయ్యి చాపింది. నోట్లో పోశాను. చిరు చేదు. పది రూపాయల నోటు చేత పెత్తే ఆమె నోటిలో పళ్ళన్నీ భయంకరంగా కనిపించాయి.

ఆనాడు నాకో జలపాతంలా కనిపించిన పర్బతీ ఈనాడు కుళ్ళు కాలవైందని గబగబా రోడ్డువేపు కదిలాను. నా వెంట పది మంది గ్రామపెద్దలు నడిచారు. కారులో కూర్చుంటే అన్ని చేతులూ నావేపే తిరిగాయి. నా క్రోధాన్ని యిక అణచిపెట్టుకోలేక నా పర్సులోవున్న డబ్బంతా కాగితపు ముక్కల్లా వాళ్ళమీద జల్లేశాను.

ఈ పదేళ్ళలో నా కత్తి నాగరికత వేళ్ళపైకూడా దాడి చేసేసింది! *

(1977)